“ఒరేయ్ అబ్బాయ్! ఆగరా..నామాట వినరా..” వీధిలోకొచ్చి మరీ కేకలు పెట్టింది బంగారమ్మ.

సాంబశివం ఆగలేదు. వెనుదిగిరి చూడనూ లేదు. తనని కాదన్నట్టు వేగంగా ముందుకి నడిచాడు.

“సాంబశివా! మీ అమ్మ పిలుస్తోందిరా..” ఒకతనన్నాడు.

“దానికేం పన్లేదు!”

“అదేం మాటరా. ఎందుకు పిలుస్తోందో ఏమో. వెనక్కెళ్ళి కనుక్కోరా”

“మా అమ్మదంతా చాదస్తం బాబాయ్. ఏదేదో చెబుతూనే వుంటుంది. అవతల బస్సొచ్చే టైమయ్యింది. ఈ బస్సు తప్పితే గుంటూరు పాసెంజరుకి అందుకోలేను.”

ముఖం కందగడ్డలా చేసుకుని జవాబిచ్చాడు. అతను విడ్డూరంగా చూస్తోంటే పట్టించుకోకుండా అడుగువేశాడు.

అసలిందుకే స్వగ్రామానికి రావడం తనకిష్టముండదు. ఊళ్ళో అడుగుపెడితే చాలు ఊరంతా పలకరిస్తారు. తన తల్లి పడుతోన్న కష్టనష్టాలు ఏకరువు పెడతారు. ఆవిడ్ని సరిగ్గా చూడటం లేదని నిష్ఠూరమాడతారు. అది మంచి పద్ధతి కాదని హితవు చెబుతారు!

అంతే తప్ప తనగోడు విన్పించుకోరు. అందుకే వాళ్ళనుంచీ ఊర్నించీ దూరంగా పారిపోవాలనుంటుంది తనకి!

“ఏంరా సాంబశివా. ఎప్పుడొచ్చేవురా..అప్పుడే వెళ్ళిపోతున్నట్టున్నావేంరా” తాత వరసయ్యే ఆయన అడిగాడు.

“ఇంతక్రితమే..పొద్దుటే వచ్చాను చిన తాతా..అమ్మని చూసెళ్దామనీ..” తడబడుతూ చెప్పేడు.

“మీ అమ్మ పరిస్థితేం బాగోలేదురా. ఏదో ఊరివాళ్ళంతా తలో చెయ్యీ వేస్తూండబట్టి బండి లాక్కొస్తోందిగాని లేకపోతే అబ్బే..!”

“నెల నెలా నేను డబ్బు పంపిస్తూనే వున్నాను చిన తాతా.” ముఖం తెల్లగా పాలిపోగా పీలగొంతుతో అన్నాడు.

“పదో పరకో పంపిస్తున్నావని చెబుతోందిలే. నువ్వు పంపినా పంపకపోయినా నీ గురించి ఒక్క చెడు మాట కూడా చెప్పదనుకో”

తేలుకుట్టిన దొంగలా వుండిపోయాడు సాంబశివం.

“తలమీద పెట్టుకుని పూజ చేసినా తల్లి ఋణం తీర్చుకోలేంరా అబ్బాయ్. తల్లి కంటనీరు నీకు శుభం కాదరేయ్..”

“ఇప్పుడేవంత ఇదొచ్చిందనీ..”

“అమ్మ పుట్టింటి గొప్పలు మేనమామ దగ్గరేంట్రా. నువ్వేంటో మీ అమ్మేంటో నాకు తెలీదూ. పెద్దవాణ్ణి చెబుతున్నాను. నా మాట విని మీ అమ్మని గుంటూరు తీసుకెళ్ళిపో. కలో గంజో నీతో పాటే తాగి పడివుంటుంది”

“తీసుకెళ్దామనే వచ్చాను. వూహూ. ససేమిరా రానంటోంది. ఈ ఊరినీ ఈ మనుషుల్నీ వదలిరాదుట. ఈ మట్టిలోనే కలిసిపోవాలంట..”

“నీకు కష్టం కలక్కూడదని చెప్పిన మాటరా అది. తల్లి మనస్సు ఎంత గొప్పదో చూడు. తనేమైనా ఫర్లేదు. నీకేం కష్టం రాకూడదని ఆత్రపడుతోంది..”

ఇంతలో బస్సు హారన్ విన్పించింది.

“బస్సొచ్చింది తాతా. ఈసారొచ్చినప్పుడు అమ్మని తీసుకెళ్ళిపోతాన్లే”

ఎవరో తరుముతున్నట్టు గబగబా అడుగులేసి ‘హమ్మయ్య’ అని ఊపిరి పీల్చుకున్నాడు.

తల్లికి అడపాదడపా తనిచ్చే డబ్బు సరిపోదని తనకీ తెలుసు. కానేం చెయ్యగలడు? తన ఆర్థిక పరిస్థితీ అంతంతమాత్రమేనాయె! దానికి తగ్గట్టు భార్య కోరికలూ పిల్లల చదువులూ వెరసి ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఎలావేలా తన దగ్గరే వుంచుకుందామంటే ఆవిడ మందుల ఖర్చు భరించడం కష్టం. డాక్టర్‌కి చూపించకపోతే అంతా తలోరకంగా మాట్లాడతారు!



పైగా ఆవిడ తమతో వుండటం రమకిష్టం లేదు. చాకిరీ చెయ్యడం తన వల్ల కాదని ఎప్పుడో తెగేసి చెప్పేసింది!

కరణంగారి ఇంటివైపు వెళ్తోంటే ఆయనే ఎదురొచ్చారు. ప్రాణం లేచొచ్చినట్టన్పించింది సాంబశివానికి.

కరణీకాలు పోయాక ఆస్తుల అమ్మకాలూ కొనుగోళ్ళు రిజిస్ట్రేషన్లూ చూస్తూ ‘లేఖకుడి’గా అవతారమెత్తారాయన.

“కరణంగారూ! మీతో చిన్న పనుంది..”

కళ్ళజోడు పై నుంచి చూసి, “నువ్వటోయ్. ఎప్పుడు దిగేవేంటి” అన్నారాయన.

“ఇవాళేలెండి కాని మా ఇంటిని అమ్మేద్దామనుకుంటున్నాం. మంచి బేరం చూసి పెట్టండి”

“బంగారమ్మ ఇక్కడే వుంటోందిగా!”

“నాతో గుంటూరు తీసుకుపోతున్నానెండి. ఏదైనా కొష బేరం చూసి పెట్టండి. మీ దగ్గర దాపరికమెందుకు. పిల్లల కాలేజీ చదువులకి డబ్బు కావాలి. వ్యవహారం ఎంత త్వరగా తెమిలిస్తే అంత మంచిది.”

“పాడుబడిపోయిందాయె. ఈమధ్య పెంకు కూడా నేయించలేదు కదూ..”

“లేదనుకోండి..”

“చూద్దాంలే..నీ ఆఫీసు ఫోన్ నెంబరియ్యి. పంటలు చేతికి వచ్చేలోపు కుదిర్చేస్తాన్లే..”

“మర్చిపోకండి సుమా. నాకీ మేలు చేస్తే నా నెత్తిన పాలు పోసినవారవుతారు” ఫోన్ నెంబరిస్తూ అన్నాడు.

“అలాగేనోయ్. నా పనే అది కదా..” అగ్గిపుల్లతో పళ్ళు కెలుక్కుంటూ అన్నాడు.

“ఇందాకా బస్సు హారన్ విన్పించింది. మనూరి బస్సు కాదంటారా”

“లారీ వెళ్ళిందిలే. ఇప్పుడో ఇంకాస్సేపట్లోనో వచ్చేస్తుందిలే. మరి వుంటానోయ్”

ఆయనెళ్ళిపోయారు.

“వచ్చిన పనయ్యింది” చిన్నగా నిట్టూరుస్తూ అనుకున్నాడు.

బస్సాగే సెంటర్లోకెళ్ళి కిళ్ళీబడ్డీ ముందున్న బెంచీమీద చతికిలబడ్డాడు.

ఏడేళ్ళమ్మాయి పరుగున వచ్చింది. ఒగురుస్తూ మట్టిపిడత అందిచ్చిందతడికి.

ఆ పిల్లనీ పిడతనీ మార్చి మార్చి చూశాడు. ఏమీ అర్థం కాలేదు.

“మామ్మ ఇచ్చింది. జున్నుపాలు..”

జున్ను అంటే తనకెంతో ఇష్టం. తిని ఎన్నేళ్ళయ్యిందో!

అందుకని ఎవరి దగ్గరో తీసుకుని అమ్మ పంపిందన్నమాట!

కళ్ళు చెమ్మగిల్లాయి.

అంతలోనే పిడత వంక ఇబ్బందిగా చూశాడు.

చిన్న మట్టిపిడత. దాని మూతిని అరటి ఆకుతో కప్పి చిక్కం బిగించారు.

దిష్టి పిడతలా కన్పించింది.

దాన్నలా పట్టుకెళ్ళటం చాలా నామోషీగా అన్పించింది. చూసినవాళ్ళు తననో పల్లెటూరి బగ్గిరాయి అనుకుంటారేమో అనీ అన్పించింది. అలా అని వద్దని తిరిగి పంపితే అంతా ఏదేదో అనుకుంటారు. పోనీ ఎలావేలా తీసుకెళ్దామంటే రమకి జున్ను వండటం రాదు!

అయిష్టంగానే అందుకుని బెంచీకింద పెట్టేడు.

ఆ పిల్ల రివ్వున తూనీగలా ఎగిరిపోయింది.

ఇల్లు అమ్ముతానంటే తల్లి అంగీకరించలేదు. తను కాలం చేసే దాకా ఆగమంది.

“నేనెంత ఇబ్బంది పడుతున్నానో అర్థం చేసుకోవు. నీ మూర్ఖత్వమే నీది. ఇంటిని నెత్తినేసుకుని ఊరేగు” అంటూ ఉక్రోషాన్ని కక్కేసి వచ్చేశాడు.

ఆమె పిలిచినా వెనుదిరిగి చూడలేదు. బహుశా ఈ జున్నుపాలు ఇద్దామనే పిలిచిందేమో!

మనస్సు చేదుగా అయ్యింది.

అమ్మ ఆలనాపాలనా సరిగ్గా చూడటమే లేదు. ముఖం కూడా చూపించడం మానేశాడీమధ్య. ఇప్పుడు వుండటానికి ఇల్లు కూడా లేకుండా చెయ్యాలని చూస్తున్నాడు. తనలాంటి కొడుకుని నమ్మి ఇల్లు అమ్మితే..?!

“ఒరే సాంబశివా..ఎప్పుడొచ్చేవురా” పరిచిత స్వరం పలకరించేసరికి ఇహానికొచ్చాడు.

బాల్యమిత్రుడు రాము.

“ఇందాకేరా. ఎలా వుందిరా వ్యవసాయం” నవ్వుతూ

అడిగాడు సాంబశివం.

''ఏదో దొర్లుకుపోతోంది. మీకేంరా ఉద్యోగస్తులు. ఎండైనా వానైనా మీకొకటే. హాయిగా నీడపట్టున ఫేన్ కింద కూర్చుంటారు. నెలతిరిగేసరికి జీతం వచ్చి ఒళ్ళోపడుతుంది''

''సీత కష్టాలు సీతవీ పీత కష్టాలు పీతవీనూ. మా ఇల్లు అమ్మేద్దామనుకుంటున్నాన్రా. నువ్వు కొనుక్కోకూడదూ సెంటర్లో వుంది..''

''మీ అమ్మెక్కడుంటుందిరా..''

సర్రున కోపం వచ్చిందతడికి. ప్రతివాడూ తన తల్లి గురించి ఆలోచించేవాడే. ఈ పల్లెటూరి వాళ్ళకి ఇంతకంటే మరేం పని లేనట్టుంది. ఆ ముసిల్ది ఇంకా బ్రతికి నా ప్రాణం తీయకపోతే గుటుక్కుమనకూడదూ. ఇంకా ఏం ఉద్ధరించాలనే వూరికే బతికేస్తోంది. ఆమె వల్ల అంతా తనని ద్రోహిలా చూస్తున్నారు.

అత్యంత కష్టంమీద కోపాన్ని నిగ్రహించుకున్నాడు.


అయినా అతని భావాన్ని ముఖం దాచలేకపోయింది. అప్రసన్నంగా మారి చిటపటలాడింది.

''అమ్మ గురించే అమ్మేద్దామని చూస్తున్నాన్రా. అమ్మకి..కేన్సర్..వైద్యం కోసమే..''

''నిజమా!''

''ష్..నెమ్మది. ఎవరికీ తెలీనివ్వకు. అందుకనే అలా వుంది. అంతా నేనేదో ఆవిడకి తిండి పెట్టక మాడుస్తున్నట్టు ఆడిపోసుకుంటున్నారు..''

''అరెరె. అలాగుట్రా. చాలా ఘోరంరా సాంబశివం. పిన్ని ఎంత మంచిదిరా. నోరారా ఆప్యాయంగా పిలుస్తుంది. మంచీ చెడూ కనుక్కుంటుంది. అలాటి పిన్నికి..!''



''మనమేం చేస్తాంలేరా. మన చేతుల్లో ఏముంది చెప్పు. నువ్వు ఇల్లు కొనుక్కుంటే సమయానికి ఆదుకున్నవాడివవుతావురా''

''మా నాన్నతో మాట్లాడి ఏమాటా చెబుతాన్రా''

''నేనిందాక చెప్పిన సంగతి మనస్సులోనే వుంచుకో సుమా''

అలాగే అన్నట్టు తలాడించాడు.

ఇంతలో బస్సొచ్చింది.

''వస్తాన్రా. రేటు గురించి నువ్వేం ఇదవ్వకు. నలుగురు పెద్దలూ ఎలా అంటే అలా చేద్దాం'' అంటూ లేచాడు.

బెంచీ క్రింద పిడతవంక చూశాడు. తటపటాయించాడు. క్షణకాలమే.

మరుక్షణం దాన్ని తీసుకోకుండానే వెళ్ళి బస్సెక్కేశాడు సాంబశివం.

బస్సు దిగి రైలెక్కాడు.

గుంటూర్లో దిగేసరికి రాత్రి పదిన్నరయ్యింది.

''కాయా పండా'' గుమ్మంలోనే అడిగేసింది రమ.

''పండే. కరణంగారికి చెప్పేను. నా ఫ్రెండ్ రాము కొనుక్కునేలా వున్నాడు. రెండు నెలల్లో సెటిలైపోవచ్చు''

''మీ అమ్మేమన్నారు'' మంచి నీళ్ళిస్తూ అడిగింది.

''ఏదో గోడు చెప్పుకొస్తోంది. తానే ఒప్పుకుంటుందిలే.''

పడుకున్న పిల్లలు లేచొచ్చి బామ్మ గురించడిగారు.

''మీ అందర్నీ అడిగానని చెప్పమందిరా. బాగా చదువుకోమంది. మీకని జున్నుపాలు ఎక్కడ్నుంచో తెప్పించిచ్చింది. కాని బస్టాండులో మర్చిపోయానర్రా.''

''తేవాల్సింది డాడీ..జున్ను ఎంతో బావుంటుంది కదూ'' కూతురంది.

సాంబశివం ముఖం త్రిప్పేసుకున్నాడు.

మరి వారం రోజులకి ఫోన్ వచ్చింది. బంగారమ్మ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా వుందనీ వెంటనే బయల్దేరి రమ్మనీ చెప్పేరు.

ఇంటిల్లిపాదీ బయల్దేరారు.

''పన్లోపనిగా ఇల్లు కూడా అమ్మేసుకొద్దాం. పని మానుకుని మీరు మాత్రం ఎన్నిసార్లు తిరుగుతారు'' రైల్లో అందిరమ.

''అలాగేలే. ఇక ఆ ఊరితో ఋణం తీరిపోద్ది...''

అతడికి తెలీకుండానే గొంతు గాద్గదికమయ్యింది. మరి సంభాషణ పొడిగించలేకపోయాడు.

తల్లిని చూస్తూనే అంతిమ ఘడియలని గ్రహించాడు సాంబశివం.

ఒక ప్రక్క బాధ మరో ప్రక్క ఏదో తెలీని రిలీఫ్-చిత్రంగా ఫీలయ్యాడతడు.

కొడుకునీ మనవల్నీ చూసి బంగారమ్మ గాజుకళ్ళల్లో మెరుపులు వెలిగాయి. మనవల్నీ మనవరాల్నీ ఆప్యాయంగా నిమిరింది. వాళ్ళు ఏడ్చేశారు.

కొడుకుని ప్రక్కలో కూర్చోమంది. కూర్చున్నాడు.

''ఇల్లు నీకివ్వాలనేరా. ఇదే మిగిలిన ఆస్తి..నీ కోసమేరా..రాముకి అమ్మేశాను. డబ్బిచ్చుకో..'' ఆగి ఆగి చెప్పింది.

ఊపిరి పీల్చుకోవడం కష్టంగా వుండి రొప్పసాగింది.

తల్లి అనారోగ్యం గురించి ఇల్లు అమ్ముతున్నట్టు రాముకి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. తల్లికి కేన్సర్ అని అబద్ధమాడిన సంగతి గుర్తొచ్చింది.

గిల్టీగా ఫీలవుతూ చూశాడు.

''నాకు నీ డబ్బు అక్కర్లేదురా..నువ్వు కన్పిస్తే శాన..నిన్ను చూడాలనే ప్రేనం కొట్టుకుంటాది..నువ్వు బాగుండాల్రా పిచ్చి నాన్నా..''

''నేనేమీ డబ్బివ్వనట్టూ నిన్ను పోషించనట్టూ మాట్లాడతావేంటి? నేన్నీకెన్ని చెయ్యలేదు? అవన్నీ మరచి అందరికీ ఏదేదో చెప్పి నామీద నిష్ఠూరమేస్తావా?''

సాంబశివం కోపంగానే అడిగాడు. అంతా విస్తుబోయి చూశారు.

బంగారమ్మ తన కళ్ళనీ చెవుల్నీ నమ్మలేకపోయింది.

దుఃఖం వరదై చుట్టేయగా ఊగిపోయింది.

''ఒరే..ఒరే..నువ్వు చేసిందీ ఇచ్చిందీ నిన్ను కనటానికి నొప్పులు పడుతూ నేను పెట్టిన ఒక్క కేకకి సరిపోవురా..సాటిరావురా..ఏవనుకున్నావో! బతుకంతా వూడిగం చేసినా ఆ బాధ తీరదురా. నువ్వేకాదు. ఏ కొడుకూ తీర్చల్లేడ్రా..''

బాధతో క్షోభతో ఆక్రోశంతో సుళ్ళు తిరిగింది.

పేగుబంధం పడిన తొలిక్షణాన్నుంచీ కొడుక్కోసమే తపిస్తూ వచ్చిన ఆమె గుండె ఆగింది.

సెలవంటూ చెప్పకుండానే మౌనంగా సెలవు తీసుకెళ్ళిపోయిందా బంగారు తల్లి కనిపించని లోకాల్లోని కన్న తల్లిని వెదుక్కుంటూ!

★

**సి.ఎస్.కుసుమాంబ**